సాక్షి అనకాపల్లి

బుధవారం । 13 । నవంబర్ । 2024



సామూహిక వ్రతాలు

సీతంపేట: కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా విశాఖ శ్రీలలితాపీఠంలో సామూహిక సత్య నారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు.



క్యాన్సర్ ఓపీ ప్రారంభం

మహారాణిపేట: కేజీహెచ్‌లో క్యాన్సర్ ఓపీని మంగళవారం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ ప్రారంభించారు.

వాతావరణం

అనకాపల్లి: రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై, అక్కడక్కడ జల్లులు పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావ రణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం పేర్కొన్నారు. ఈనెల 13న 0.5 మి.మీ, 14న 0.5 మి.మీ వర్షపాతం నమోదవుతుందని, గరిష్ట ఉష్ణోగ్రతలు 31.8 నుంచి 32.2 డిగ్రీల వరకు నమోదవుతాయని చెప్పారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

దాబాగార్డెన్స్ (విశాఖ): జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం జేసీ మయూర్ అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్.సి.హెచ్ వెంకటరావు మాట్లాడుతూ 14న బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథపాలకుల సదస్సు, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, దేశభక్తి గేయాల పోటీలు, 19న మహిళా దినోత్సవం, వివిధ అంశాలపై విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామన్నారు. 20న డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామని వివరించారు.

పెయిన్ కిల్లర్ వద్దు యోగాసనాలే ముద్దు

- న్యూరో సమస్యలకు అదే సరైన పరిష్కారం
- నిజాం ఇన్‌స్టిట్యూట్ వైద్యుడు రమేష్



నరాల వ్యాధుల నివారణపై అవగాహన కల్పిస్తున్న నిజాం ఇన్‌స్టిట్యూట్ వైద్య నిపుణుడు

రోలుగుంట: నరాల సంబంధ వ్యాధుల నియంత్రణకు పెయిన్ కిల్లర్ మందుల కన్నా యోగాసనాలతోనే ఆశించిన ఫలితం ఉంటుందని నిజాం ఇన్‌స్టిట్యూట్ వైద్యనిపుణుడు రమేష్ చెప్పారు. మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం నరాల సంబంధ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న డాక్టర్ రమేష్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్‌ల వినియోగం వల్లనే న్యూరో సమస్యలు వస్తాయన్నారు. ల్యాప్‌టాప్‌ను తొడ భాగంపై ఉంచి వినియోగించడం మంచిది కాదన్నారు. టేబుల్ పైనే ఉంచి వాడుకోవాలన్నారు. మొబైల్ ఫోన్‌ను ప్యాంటు జేబులో, చొక్కా జేబులో ఉంచుకోవడం సేఫ్ కాదన్నారు. కుడి భాగంలో ఉంచేకన్నా ఎడమ భాగంలోనే ఉంచుకోవడం మేలన్నారు. వీటన్నింటికన్నా బెల్టుకు పౌచ్ బిగించి, అందులో సెల్‌ఫోన్ ఉంచుకోవడం మేలన్నారు. పడుకునే సమయంలో ఫోన్ తలదిండు కింద ఉంచుకొనే విధానం విడనాడాలన్నారు. ఈ సందర్భంగా యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీడీవో నాగేశ్వరరావు ఉద్యోగులను కోరారు.

గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు

సాక్షి, అనకాపల్లి: గంజాయి కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష విధించారు. పదేళ్ల క్రితం బుచ్చెయ్యపేట మండలం రాజాం జంక్షన్‌లో వాహన తనిఖీల్లో పట్టుబడిన ముద్దాయిలు పడాల నాగేశ్వరరావు, గుర్రం నగేష్‌లకు పదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తూ 9వ అదనపు సెషన్స్ కోర్టు మంగళవారం తీర్పు వెల్లడించింది. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మీడియాకి కేసు వివరాలు వెల్లడించారు. 2014లో పక్కా సమాచారంతో బుచ్చెయ్యపేట ఎస్ఐ కె.లక్ష్మణరావు, సిబ్బందితో కలిసి రాజాం జంక్షన్‌లో చెరుకు కాటా వద్ద వాహన తనిఖీలు చేయగా 36 కేజీల గంజాయి పట్టుబడింది. నిందితులపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేశారు. పీపీ ఉగ్గిన వెంకట్రావు పోలీసుల తరపున వాదనలు వినిపించారు. అదనపు జిల్లా న్యాయమూర్తి కె.రత్నకుమార్ ముద్దాయిలకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండున్నరేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉందని తీర్పునిచ్చారు.

జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు జశ్వంత్



జాతీయ పోటీలకు ఎంపికైన జశ్వంత్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం పడాల్‌దాస్

దేవరాపల్లి: జాతీయ స్థాయి సెపక్ తక్రా పోటీలకు దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.జశ్వంత్ ఎంపికయ్యాడు. కర్నూల్‌లో ఈ నెల 9,10 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరిగిన అండర్-17 విభాగంలో జశ్వంత్ సత్తా చాటాడు. ఈ పోటీల్లో విశాఖ జిల్లా జట్టుకు నాలుగో స్థానం లభించింది. ఈ జట్టులో విశేష ప్రతిభ కనబరిచిన జశ్వంత్‌ను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. మణిపూర్‌లో వచ్చే నెలలో జరిగే జాతీయ పోటీల్లో జశ్వంత్ పాల్గొంటారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు బి.పడాల్‌దాస్ తెలిపారు.

ప్రశస్తంగా.. ప్రయోజనకరంగా..

శారీరక, మానసిక వైకల్యం జీవితాంతం వెంటాడే శాపం. ఆ లోపాన్ని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే, తగిన చికిత్స అందిస్తే సమస్య తీవ్రతను తగ్గించవచ్చు. బాధితులకు అండగా నిలిచి వీలైనంత సాంత్వన కలిగించవచ్చు. అందుకే పాఠశాల విద్యార్థుల్లో ప్రత్యేక అవసరాలు గల వారిని గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రశస్త సర్వేను చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వ సమన్వయంతో, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల్లో దివ్యాంగులను గుర్తించి, వారి వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి, అవసరమైన చర్యలు తీసుకుంటోంది.

- దివ్యాంగ బాలలను గుర్తించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో జోరుగా సర్వే
- విద్యార్థుల మానసిక, శారీరక స్థితిగతులపై ఆరా
- ప్రశస్త యాప్‌లో దివ్యాంగుల వివరాల నమోదు
- జూన్‌లో సర్వే ప్రారంభం.. ఈ నెలాఖరుకు పూర్తయ్యే అవకాశం
- బాధితులకు వైద్య చికిత్సలతో పాటు సదరం ద్వారా పెన్షన్ సదుపాయం



ప్రశస్త యాప్ లోగో



యాప్ డౌన్‌లోడ్ చేసుకున్న ఉపాధ్యాయులతో సమన్వయకర్త శకుంతల

జిల్లాలో ఇప్పటివరకు సర్వే చేసిన విద్యార్థులు **1.33** లక్షలు (60 శాతం)
వీరిలో విభిన్న ప్రవర్తన గల బాలలు **2** వేలు

సాక్షి, అనకాపల్లి: అన్ని వైకల్య లక్షణాలు బయటకు తెలియవు. ముఖ్యంగా మానసిక లోపాలు పైకి కనిపించవు. విద్యార్థులతో నిరంతరం కలిసి ఉండే ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సహకారంతో ఇలాంటి లోపాలను ముందుగానే గుర్తిస్తే.. చిన్నారులకు త్వరగా నివరణ చర్యలు తీసుకోవచ్చన్న ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం ప్రశస్త సర్వేను ప్రారంభించింది. బాధితులను గుర్తించి వారికి ఉచిత వైద్య సేవలు, పింఛను సదుపాయం కల్పించేందుకు ఈ సర్వే తోడ్పడుతుంది. గత విద్యా సంవత్సరంలో కొంత మేర సర్వే చేశారు. సత్ఫలితాలు రావడంతో పూర్తి స్థాయిలో ఈ ఏడాది జూన్ నెల నుంచి ఈ సర్వే ప్రక్రియను జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగిస్తున్నారు. ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసే విధంగా సర్వశిక్ష జిల్లా సహిత విభాగం అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సహకారంతో చర్యలు చేపట్టింది. నూతన విద్యావిధానానికి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం ప్రశస్త (ప్రీ అసెస్మెంట్ హోలిస్టిక్ స్క్రీనింగ్ టూల్) యాప్‌ను రూపొందించింది. సర్వే వివరాలను ఇందులో నమోదు చేస్తున్నారు. పిల్లల్లో ఉన్న శారీరక, మానసిక వైకల్యాలను సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే వారు త్వరగా మామూలు పరిస్థితికి రాగలరన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

రెండు దశల్లో సర్వే..

ప్రశస్త యాప్‌లో మొదటిగా స్కూల్ హెడ్ మాస్టర్ పిల్లల వైకల్యాలను పొందుపరుస్తారు. ఆ తర్వాత ఐఈఆర్టీలు పిల్లల వద్దకు వెళ్లి సర్వేలో పొందుపర్చిన వివరాలు సరిగా ఉన్నాయో లేదో తనిఖీ చేస్తారు. శిక్షణ పొందిన ఎడ్యుకేటర్లు వైకల్యం ఉన్న విద్యార్థుల వివరాలను సరిచూసుకొని ఆన్‌లైన్‌లోనే సర్టిఫై చేస్తారు.



విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఉపాధ్యాయుడు

ఏమేం గుర్తిస్తారంటే..

ఈ సర్వేలో విద్యార్థుల్లో ఉన్న లోపాలను విభాగాల వారీగా గుర్తిస్తున్నారు. విద్యార్థి తనకు తానుగా పనులు ఎలా చేసుకుంటున్నాడు.. మాటలు ఎలా వస్తున్నాయి.. కాళ్లు చేతుల పరిస్థితి.. తల ఎలా ఉంది, పొడవు, పొట్టి చేతివేళ్లు మొదలైన అంశాలకు సంబంధించిన వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. విద్యార్థి చదువు, చూపు ఏ విధంగా ఉంది.. బ్లాక్ బోర్డు సరిగా కనిపిస్తుందా.. తరగతి గదిలో తోటి విద్యార్థులతో అతడి ప్రవర్తన ఎలా ఉంది.. తదితర వివరాలు సేకరిస్తున్నారు. ఉపాధ్యాయుల సూచనలను పాటిస్తున్నాడా లేదా వంటి 21 అంశాలపై ఆరా తీసి వివరాలు నమోదు చేసుకుంటున్నారు.

21 రకాల వైకల్యాలతో 'ప్రశస్త' యాప్

ఎస్సీఈఆర్టీ రూపొందించిన 'ప్రశస్త' యాప్ సర్వే శరవేగంగా సాగుతోంది. ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు 21 వైకల్య పరిస్థితులను ప్రస్తావిస్తూ ఈ యాప్ రూపొందించారు. 'పార్ట్-ఎ'లో తరగతి ఉపాధ్యాయులు 63 ప్రశ్నల ద్వారా విద్యార్థుల ప్రవర్తనను పరిశీలిస్తారు. 'పార్ట్-బి'లో మరిన్ని భిన్న ప్రవర్తనలు గల విద్యార్థులను స్పెషల్ ఎడ్యుకేటర్లు గుర్తిస్తారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఈ సర్వేలో కీలకంగా వ్యవహరిస్తారు. మేధోపరమైన వైకల్యం, సెరిబ్రల్ పాల్సీ, ఆటిజం, మల్టిపుల్ డిజెబిలిటీ కలిగిన పిల్లలకు 'నిరామయ హెల్త్ ఇన్సూరెన్స్' పాలసీని కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది.

–శకుంతల, సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త

చోళుల కాలం నాటి పంచలోహ విగ్రహాలు

బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



స్వామి వారి ఆలయానికి తీసుకువచ్చిన పంచలోహ విగ్రహాలు



కల్యాణ శోభతో శివ పార్వతుల పంచలోహ విగ్రహాలు

నర్సీపట్నం: బలిఘట్టం శ్రీబ్రహ్మలింగేశ్వర స్వామి ఆలయంలో చోళుల కాలం (16వ శతాబ్దం) నాటి శివపార్వతుల పంచలోహ విగ్రహాలను దేవదాయశాఖ అధికారులు ప్రతిష్టించారు. శుద్ధ ఏకాదశి రోజున పంచలోహ విగ్రహాలకే శివ పార్వతుల కల్యాణం జరిపించాలని కమిటీ వారు పట్టుబట్టారు. దీంతో సబ్‌ట్రెజరీలో భద్రపరిచిన ఈ విగ్రహాలను ఈ నెల 11వ తేదీన ఎండోమెంట్ అధికారులు పోలీసు బందోబస్తు నడుమ తీసుకొని వచ్చి ఆలయంలో ప్రతిష్టించారు. మంగళవారం ఏకాదశి సందర్భంగా ఈ పంచలోహ విగ్రహాలకే శివపార్వతుల కల్యాణం జరిపించారు. ఈ అరుదైన దృశ్యాన్ని తిలకించి భక్తులు పులకించిపోయారు. ఆలయంలోని అతి పురాతనమైన ఈ పంచలోహ విగ్రహాలు 1990లో చోరీ అయ్యాయి. తాళ్లరేవు ప్రాంతంలో పోలీసులు వీటిని రికవరీ చేశారు. అప్పటి నుంచి విగ్రహాలను ట్రెజరీలో భద్రపరిచారు. కమిటీ వారి అభ్యర్థన మేరకు ఆలయ అధికారులు విగ్రహాలను ఆలయానికి తీసుకువచ్చారు.

రైతుకు సాంకేతిక భరోసా

- ఎన్‌పీఎస్ఎస్ యాప్‌తో తెగుళ్లు, వైరస్‌లు ఇట్టే పసిగట్టవచ్చు
- నివారణకు సలహాలు, సూచనలు పొందవచ్చు
- సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి కె.వీరయ్యచౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి కె.వీరయ్యచౌదరి

సాక్షి, అనకాపల్లి: పంటల్లో చీడపీడలను త్వరగా గుర్తించి సత్వర సలహాలు, సూచనలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టమ్ (ఎన్పీఎస్ఎస్) యాప్ దోహదపడుతుందని విజయవాడ సమగ్ర సస్యరక్షణ కేంద్రం అధికారి కె.వీరయ్యచౌదరి తెలిపారు. మంగళవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో కేంద్ర సస్యరక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ చీడపీడల పరిరక్షణ వ్యవస్థ, కేంద్ర వ్యవసాయ శాఖ రూపొందించిన ఎన్పీఎస్ఎస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులు, ఉద్యాన అధికారులు, శాస్త్రీయ రైతులు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎసస్యరక్షణ కేంద్రం అధికారి వీరయ్య చౌదరి మాట్లాడుతూ రైతులు ఎన్పీఎస్ఎస్ యాప్‌ను ఉపయోగించి సలహాలు, సూచనలు పొందవచ్చని అన్నారు. పంట పొలంలోని చీడపీడల ఫొటోలను యాప్లో అప్లోడ్ చేసిన వెంటనే పురుగు, తెగులును త్వరితగతిన గుర్తించడమే కాకుండా సస్యరక్షణ చర్యలను సూచిస్తుందని తెలిపారు. కృత్రిమ మేథస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)తో ఈ యాప్‌ను రూపొందించారన్నారు. రైతులు సాగు చేసే ప్రధానమైన 15 రకాల పంటల్లో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమాచారం అందించగానే చీడపీడల నివారణ చర్యలను ఈ యాప్ సిఫార్స్ చేస్తుందని వివరించారు. ఈ యాప్ ద్వారా తెగులు, కీటకం హానికరమైందో లేదా ప్రయోజనకరమైందో తెలుసుకోవచ్చన్నారు. క్రిమిసంహారకాల కంటే ముందుగా సస్యరక్షణ యాజమాన్య పద్ధతులను ప్రోత్సహించే విధంగా యాప్ సిఫార్సులు ఉంటాయని తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి ఎం.ఎస్.వసంతకుమారి మాట్లాడుతూ ప్రతి రైతు వారి పంటల వివరాలను ఈ యాప్‌లో నమోదు చేసుకోవడం ద్వారా వచ్చే ప్రయోజనాలను వివరించారు. అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డా.ముకుంద రావు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతులలో రైతులకు ఈ యాప్ ద్వారా సలహాలు, సూచనలు అందుతాయన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం, సహాయ వ్యవసాయ సంచాలకులు పి.శ్రీధర్, భూ సంరక్షణ సహాయ వ్యవసాయ సంచాలకులు కె.మురళి, ఏఎస్పార్ జిల్లా వ్యవసాయఅధికారి ఏఓ సూర్యప్రకాష్, విశాఖ వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం, విజయవాడ సహాయ కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు, కె.సురేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

రూ.20 లక్షల డ్వాక్రా సంఘం నిధులు హాంఫట్

- వెలుగు, బ్యాంక్ సిబ్బంది కుమ్మక్కు
- సభ్యులకు తెలియకుండానే రుణం మంజూరు
- దొంగ ఖాతాలకు నిధుల మళ్లింపు



గోవాడ స్టేట్ బ్యాంక్ వద్ద ఆందోళన చేస్తున్న బాధిత డ్వాక్రా సంఘాలు

చోడవరం: డ్వాక్రా సంఘం రుణం డబ్బులు కాజేసిన వైనం వెలుగులోకి వచ్చింది. వెలుగు సిబ్బంది, బ్యాంక్ అధికారులు కలిసి కుమ్మక్కై, సుమారు రూ.20 లక్షల వరకు గోల్‌మాల్ చేసినట్టు బాధిత డ్వాక్రా సంఘ సభ్యులు ఆరోపిస్తున్నారు. రుణం ఇవ్వకుండానే డబ్బులు కట్టాలని బ్యాంక్ నుంచి డ్వాక్రా సంఘానికి ఒత్తిడి రావడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ బాధిత మహిళలు హుటాహుటిన గోవాడ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద మంగళవారం గొడవకు దిగడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే... చోడవరం మండలం సింహాద్రిపురం పంచాయతీ పరిధిలో 15 డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాల నిర్వహణ కోసం వెలుగు శాఖ నుంచి వీవోఏగా వరలక్ష్మి, సీసీగా తాతబాబు పనిచేస్తున్నారు. సబ్బవరపు కల్లాలకు చెందిన శ్రీరామ డ్వాక్రా సంఘానికి రూ.7 లక్షలు రుణం ఇచ్చినట్టుగా చూపించి, ఆ అప్పు తీర్చాలంటూ తొలుత గోవాడ ఎస్‌బీఐ బ్యాంక్ నుంచి సమాచారం రావడంతో ఆ సంఘ సభ్యులు బ్యాంక్‌కు పరుగులు తీశారు. వీఓఏను కూడా బ్యాంక్‌కు తీసుకెళ్లడంతో అసలు బాగోతం బయటపడింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో ఈ డ్వాక్రా సంఘానికి రూ. 6.90 లక్షలు రుణం ఇచ్చినట్టుగా బ్యాంక్ రికార్డుల్లో ఉంది. అయితే ఆ మొత్తం సంబంధిత డ్వాక్రా గ్రూపు సభ్యుల ఖాతాల్లో మాత్రం పడలేదు.

మోసం జరిగిందిలా..

శ్రీరామ డ్వాక్రా సంఘం నుంచి గతంలో రుణం కావాలని బ్యాంక్‌కు దరఖాస్తు చేస్తే అప్పట్లో అధికారులు తిరస్కరించారు. ఆ పత్రాలన్నీ వీఓఏ వరలక్ష్మి తన వద్ద ఉంచుకొని సంఘ సభ్యులకు తెలియకుండా మళ్లీ ఆ దరఖాస్తును రుణం కోసం బ్యాంకుకు ఇచ్చింది. అక్కడ బ్యాంక్ అధికారులు కూడా వీఓఏతో కుమ్మక్కై రుణం మంజూరు చేశారు. డ్వాక్రా సంఘం సభ్యుల ఖాతాల్లో కాకుండా.. కొత్తగా ఖాతాలు తెరిచి అందులో డబ్బులు వేసి కాజేశారని బాధిత శ్రీరామ డ్వాక్రా సంఘం సభ్య మహిళలు ఆరోపిస్తూ గొడవ చేశారు. తక్షణం దీనిపై చర్యలు తీసుకోవాలని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు వెన్నెల యోగిత, సబ్బవరపు సంధ్య కోరారు. సింహాద్రిపురం, శివారు గ్రామం సబ్బవరపువారి కల్లాలకు చెందిన డ్వాక్రా మహిళలంతా వ్యవసాయం, కూలి పనిచేస్తూ జీవం సాగిస్తున్నారు. వీరికి బ్యాంక్‌లకు వెళ్లేందుకు సమయం లేకపోవడంతో ప్రతీ నెల ఆయా సంఘాల నుంచి బ్యాంక్‌కి కట్టాల్సిన వాయిదా డబ్బులు వెలుగు వీవోఏ వరలక్ష్మికి ఇవ్వగా ఆమె గత కొంతకాలంగా బ్యాంక్‌కు కట్టకుండా తన వద్దే ఉంచేసుకుందని వారు ఆరోపించారు. ఇలా సుమారు 11 లక్షల వరకూ కట్టకపోవడంతో సభ్యులు నిలదీయగా కట్టలేదని ఆమె అంగీకరించి సంబంధిత డ్వాక్రా సంఘాలకు ఇవ్వాల్సిన డబ్బులు సంబంధించి ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చినట్టు తెలిసింది. ఈ వ్యవహారంపై బ్యాంక్, వెలుగు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డ్వాక్రా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. దీనిపై విచారణ చేసి బాధితులపై చర్యలు తీసుకుంటామని చోడవరం వెలుగు ఏపీఎం తిలక్ చెప్పారు.

తుస్సుమన్న 'పంచాయతీ'

- పక్కదారిపట్టిన ఈవోపీఆర్డీ బదిలీల విచారణ
- అనకాపల్లి, అల్లూరి జిల్లాల బదిలీలపై ఆరోపణలు
- విశాఖ జిల్లాకే విచారణ పరిమితం
- నివేదికను కలెక్టర్ హరేందిరప్రసాద్‌కు సమర్పించిన జెడ్పీ సీఈవో



జిల్లా పరిషత్ భవనం

మహారాణిపేట (విశాఖ): మోకాలికి దెబ్బతగిలితే బోడి గుండుకు కట్టు వేసినట్లు ఉంది పంచాయతీ రాజ్ శాఖ అధికారుల తీరు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో జరిగిన బదిలీల్లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తే.. వాటిని మినహాయించి విశాఖ జిల్లాలో బదిలీలపై మాత్రమే విచారణ చేయించడం విడ్డూరంగా ఉంది. అసలు దొంగలకు కొమ్ము కాయడానికి కూటమి నేతల నుంచి ఉన్నతాధికారుల వరకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో తీవ్ర దుమారం రేపిన ఈవోపీఆర్డీల బదిలీల వ్యవహారంలో విచారణ చివరకు తుస్సుమనిపించారు. ఆరోపణలు ఉన్న జిల్లాల్లో విచారణ చేయకపోవడం పట్ల పంచాయతీరాజ్ ఉద్యోగులు విస్తుపోతున్నారు. ఈ బదిలీల్లో అక్రమాలు జరిగాయని ఉద్యోగులే స్వయంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ.. విచారణను పక్కదారి పట్టించడం ఇప్పుడు పంచాయతీరాజ్ శాఖలో హాట్ టాపిక్‌గా మారింది.

అనకాపల్లి కేంద్రంగా అక్రమాలు

అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో ఈవోపీఆర్డీ అధికారుల బదిలీల వ్యవహారంపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. కొంతమంది పంచాయతీ అధికారులు, సిబ్బంది.. నచ్చిన వారిని అందలం ఎక్కించారన్న విమర్శలు వినిపించాయి. ఇందులో భారీగా డబ్బులు చేతులు మారినట్టు స్వయంగా ఉద్యోగులే బహిరంగంగా చెబుతున్నారు. ఈ అక్రమ బదిలీలు కారణంగా దీర్ఘకాలంగా అల్లూరి జిల్లాలో పనిచేస్తున్న వారు ఇప్పటికీ మైదాన ప్రాంతాలకు రాలేకపోయారు. మైదాన ప్రాంతాల్లో ఉన్న వారు గిరిజన ప్రాంతాలకు వెళ్లకుండా తమ పలుకుబడిని ఉపయోగించి స్థానికంగానే పోస్టింగ్‌లు సంపాదించుకున్నారు. దీనిపై కొంత మంది ఉద్యోగులు కలెక్టర్ హరేందిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ ఈ బదిలీల వ్యవహారంపై జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తితో విచారణకు ఆదేశించారు. దీని ప్రకారం సీఈవో అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పోస్టింగ్‌ల వివరాలు కోరినప్పటికీ.. సంబంధిత అధికారుల నుంచి స్పందన లేకపోవడం విశేషం. విచారణ హాజరుకావాలని రెండు సార్లు అనకాపల్లి డీపీవో, అల్లూరి జిల్లా డీపీవోలకు చెప్పినా డుమ్మా కొట్టారు. బదిలీల జాబితాను సైతం విచారణాధికారికి ఇవ్వలేదన్న వాదనలు ఉన్నాయి. ఈ దశలో విచారణ నుంచి అనకాపల్లి, అల్లూరి జిల్లాలను మినహాయించారు. ఆయా జిల్లాల్లో జరిగిన బదిలీలపైనే ఆరోపణలు రాగా.. వాటిని తప్పించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం విశాఖ జిల్లాలో మాత్రమే విచారణ చేపట్టేలా ఆదేశాలిచ్చారు. ఇందుకు తగ్గట్టుగానే జెడ్పీ సీఈవో విశాఖ జిల్లాలో విచారణ పూర్తి చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు.

ప్రజా ప్రతినిధుల హస్తం

జెడ్పీ సీఈవోను రెండు జిల్లాల విచారణ నుంచి తప్పించడంలో కొంత మంది ప్రజాప్రతినిధులు కీలకపాత్ర పోషించినట్టు తెలిసింది. సమాచార సేకరణలో వేగంగా ఉండడం, బదిలీలైన వారి వివరాలు, బదిలీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ఇవ్వాలని జెడ్పీ సీఈవో అడగడంతో కొంత మంది అధికారుల్లో భయం నెలకొంది. ఈ విచారణకు పంచాయతీ అధికారులు సహకరించకపోవడం వంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో కూటమి ప్రజాప్రతినిధులు రంగంలోకి దిగి తమ వారిని కాపాడుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేశారు. అందువల్లే అనకాపల్లి, అల్లూరి జిల్లాలను విచారణ నుంచి మినహాయించారు. దీంతో మొత్తం విచారణ నీరు కారిపోయింది.

వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్

విశాఖ లీగల్: వచ్చే నెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో సాధ్యమైనంత వరకు ఎక్కువ కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. విశాఖ జిల్లా కోర్టులో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోటార్ ప్రమాదాలు, సివిల్, చెక్ బౌన్స్, రాజీపడదగిన క్రిమినల్ కేసులకు పరిష్కారం చూపాలన్నారు. మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల న్యాయమూర్తులు వర్చువల్‌గా ఈ సమావేశానికి హాజరయ్యారు.

మద్యం షాపు మాకొద్దు బాబోయ్



మద్యం షాప్‌ను తొలగించాలని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న శారదానగర్ మహిళలు

తొలగించాలని శారదానగర్‌వాసుల కొవ్వొత్తుల ర్యాలీ

అనకాపల్లి: పట్టణంలోని శారదానగర్ ప్రాంతంలో మద్యం షాపును ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని శారద సంక్షేమ సంఘం ప్రతినిధులు వైన్ షాప్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో శారదానది బ్రిడ్జి నుంచి రూరల్ పోలీస్‌స్టేషన్ వరకు మహిళలు, యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కొత్తూరు పంచాయతీ పరిధి శారదానగర్‌లో ఎట్టి పరిస్థితుల్లో మద్యం దుకాణం ఏర్పాటు చేయవద్దని పంచాయతీలో తీర్మానం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తొలగించాలన్నారు. శారదా సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఉపాధ్యాయులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆయుష్ వైద్య విధానంపై అవగాహన అవసరం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారి కుసుమకుమారి

కశింకోట: ప్రతి ఒక్కరూ ఆయుష్ వైద్య విధానంపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి కుసుమకుమారి సూచించారు. మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ ఆయుష్ మిషన్ కార్యక్రమం కింద ఆశ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మధుమేహానికి అందించాల్సిన వైద్య సేవలపై అవగాహన కల్పించారు. ఆశ కార్యకర్తలంతా సాధారణ వ్యాధులతో పాటు మధుమేహానికి అందించాల్సిన వైద్య సేవలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి యు.రమేష్, ఎంపీహెచ్‌ఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు

తుమ్మపాల: పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీ ప్రాజెక్టు ప్రభావిత పరిసర గ్రామాల నిరుద్యోగ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు సీఐపీఈటీ(విజయవాడ) డైరెక్టర్ సిహెచ్.శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 నుంచి 30 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగ యువతకు విజయవాడలో పాలిమెర్స్ టెక్నాలజీలో ఆరు నెలల పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్‌తో పాటు విశాఖపట్నం, అనంతపురం, హైదరాబాద్, బెంగుళూర్, చెన్నై, తదితర ప్రాంతాల్లో ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ సంస్థలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలతో పాటు నెలకు రూ.3వేల స్టయిఫండ్ అందిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు సంస్థ ప్రతినిధి బి.అంజీనాయక్ ఫోన్ నెం.7893586494 సంప్రదించి దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

10 మద్యం బాటిళ్ల స్వాధీనం

అనకాపల్లి: జాతీయ రహదారి పూడిమడక జంక్షన్ పాన్‌షాప్‌లో 10 మద్యం క్వార్టర్ బాటిళ్లను పట్టణ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ సంతోష్ కథనం మేరకు.. అజ్ఞాత వ్యక్తులు ఇచ్చిన సమాచారం మేరకు పాన్ షాప్‌పై పోలీసులు దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న ఎ.భాస్కరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగళవారం 1,746 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,800	4,380
మొదటి రకం	3,660	4,400
రెండో రకం	3,530	3,830
మూడోరకం	3,000	3,500

అనకాపల్లి సినిమాలు

దేవర	: రాజా
'క'	: సత్యనారాయణ స్క్రీన్-1
అమరాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
అప్పుడో ఇప్పుడో ఎప్పుడో	: షిర్డిసాయి
బ్లడీ బెగ్గర్	: షిర్డిసాయి
ధూం ధాం	: వెంకటేశ్వర
విశ్వం	: శ్రీసత్య
లక్కీ భాస్కర్	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్త నిధి కేంద్రంలో 43 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-6 యూనిట్లు, బీ పాజిటివ్-14 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ లోకేషను ఫోన్ నంబర్ 97036 19706లో సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 367 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 318 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నంబరును సంప్రదించవచ్చును.

బతుకులు బుగ్గి పాలు.!

- కాలుష్యం కోరల్లో చింతనిప్పల అగ్రహారం
- ఊరి మధ్యలోంచి క్వారీ ట్రక్కుల రాకపోకలు
- భయం గుప్పిట్లో గ్రామస్తులు
- అడ్డుకుంటే కేసులు పెడతామంటూ పోలీసుల హెచ్చరికలతో బెంబేలు



చింతనిప్పల అగ్రహారం గ్రామం ప్రధాన మార్గంలో పాడైన బ్రిడ్జి



చింతనిప్పల అగ్రహారం ఊరిలోంచి భారీ బండరాళ్లతో వెళ్తున్న ట్రక్కు

తుమ్మపాల: క్వారీలు, క్రషర్‌లకు కేరాఫ్‌గా ఉన్న అనకాపల్లి మండలంలో ఆ ఒక్క గ్రామం అందుకు భిన్నం. ఆ గ్రామంలో క్రషర్‌లు, క్వారీలతో పాటు ఇతరాత్ర ఒక్క పరిశ్రమ కూడా లేదు. జనాభా పరంగా దాదాపు 4 వేల మందితో పెద్ద గ్రామమే అయినప్పటికీ విస్తీర్ణంలో మాత్రం అతి చిన్న గ్రామంగా చింతనిప్పుల అగ్రహారం రికార్డుల్లో నమోదైంది. వ్యవసాయం, కూలీ పనులతో జీవనాన్ని గడుపుతూ సంతోషంగా జీవిస్తున్న ఆ గ్రామస్తులకు సరిహద్దు గ్రామాలతో పెద్ద చిక్కు వచ్చిపడింది. చుట్టూ కొండలు.. వాటి నిండా దాగి ఉన్న ఖనిజాన్ని దోచుకోవడమే పనిగా కొందరు పెద్దలు పెట్టుకున్నారు. దీంతో గ్రామానికి చుట్టూ లెక్కకు మించి క్రషర్‌లు వెలిశాయి. గ్రామం మీదుగా భారీ వాహనాల రాకపోకలు మొదలయ్యాయి. కంకర క్రషింగ్‌తో నిత్యం బుగ్గిని వెదజల్లడంతో గ్రామం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. దీంతో పాటు మార్టూరు, మాకవరం గ్రామాల్లో ఖనిజాన్ని తవ్వేయడంలో కూటమి ప్రభుత్వం జోరు పెంచింది. వందల సంఖ్యలో ట్రక్కుల్లో బండరాళ్లను చింతనిప్పుల అగ్రహారం గ్రామం మధ్యలోంచి తరలించేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ట్రక్కులు తిరిగేస్తున్నాయి. అడ్డొస్తే అంతే అన్నట్లు వేగంగా ప్రయాణించడంతో గ్రామస్తులు భయంతో హడలెత్తిపోతున్నారు.

దారిపొడవునా వెదజల్లుతున్న క్రషర్ బుగ్గి

అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారికి అతి సమీపంలో ఉన్న చింతనిప్పుల అగ్రహారం మీదుగా మార్టూరు, మాకవరం, మామిడిపాలెం క్వారీలకు చేరుకోవడం చాలా సులభం. ఆయా గ్రామాల్లోని ఖనిజాన్ని నింపుకొని నిమిషాల్లో జాతీయ రహదారికి చేరుకోవడమే లక్ష్యంగా ట్రక్కులు రాకపోకలు చేస్తున్నాయి. ఈ క్రమంలో చింతనిప్పుల అగ్రహారం గ్రామస్తులు తీవ్ర దుమ్మిధూళితో సతమతమవుతున్నారు. గ్రామం మధ్యలోంచి ఉన్న రోడ్డుపై రాత్రిపగలు తేడా లేకుండా ట్రక్కులు తిరగడంతో గ్రామంలో అనేక మంది కిడ్నీ సంబంధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. సమీప గ్రామాల్లో రెవెన్యూ సరిహద్దులో ఉన్న క్రషర్‌ల కాలుష్యం కూడా అగ్రహారం ప్రజలే పీల్చుతూ అనారోగ్యం పాలవుతున్నారు.

అడ్డుకుంటే కేసులు

గ్రామం మధ్యలోంచి ట్రక్కుల రాకపోకలతో దెబ్బ తింటున్న జీవన ప్రమాణా దృష్ట్యా గత కొంత కాలంగా గ్రామస్తులు ట్రక్కులను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికి రాజకీయ నాయకుల ప్రమేయంతో ఫలితం లేకుండా పోతోంది. గ్రామంలో పెద్దరికం వహించే ఒకరిద్దరి ఆర్థిక ప్రయోజనాల కోసం ప్రాణాలను ఫణంగా పెట్టలేమంటూ ఇటీవల యువతంతా ట్రక్కులను అడ్డుకున్నారు. ట్రక్కుల్ని అడ్డుకుంటే కేసులు పెడతామంటూ పోలీసులు భయపించడంతో గ్రామస్తులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రజలంతా ప్రతిఘటించడంతో ట్రక్కుల రాకపోకలు తగ్గినప్పటికీ.. పూర్తిగా నిర్మూలించేందుకు అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఉదయం నుంచి సాయంత్రం వరకు భారీ ట్రక్కులు రావద్దని గ్రామస్తులు పెట్టిన హెచ్చరిక బోర్డు

దుమ్ముధూళి మధ్య బతుకుతున్నాం..



రోజు వందలాది లారీలు బండరాళ్లతో వేగంగా వెళ్తున్నాయి. పిల్లల్ని ఇంట్లోంచి బయటకు పంపించాలంటే భయమేస్తుంది. లారీలపై పెద్ద పెద్ద రాళ్లు కిందపడుతున్నాయి. ఇంట్లో అన్ని వస్తువులు ధూళితో నిండిపోయి ఉంటున్నాయి. రోజు నాలుగు సార్లు శుభ్రం చేసుకుంటున్నాం. ఈ మధ్య కాలంలో లారీలు చాలా ఎక్కువగా తిరగడంతో గ్రామస్తులందరం కలిసి అడ్డుకున్నాం. అయినా రాత్రి వేళ తిరిగేస్తున్నాయి. నిద్ర పట్టడం లేదు. ఇంట్లో ఉండలేక పోతున్నాం. మాకు శాశ్వత పరిష్కారం చూపాలి. బ్రిడ్జి కూడా కూలిపోయేలా ఉంది.

– యాదగిరి దుర్గాలమ్మ, చింతనిప్పుల అగ్రహారం

16న ఆటో, మోటార్ డ్రైవర్ల ధర్నా



నెహ్రూచౌక్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సభ్యులు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో టీడీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని ఈ నెల 16 రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు నిర్వహించనున్నట్లు ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్(ఏఐటీయూసీ) జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ తెలిపారు. స్థానిక నెహ్రూ చౌక్ వద్ద ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచిన ఆటో అండ్ మోటార్ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. వాహన మిత్ర పథకం కింద రూ.15 వేలు ఇస్తామని చెప్పారన్నారు. భారీగా పెంచిన డీజిల్, పెట్రోల్, వంట గ్యాస్, విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని ఆయన కోరారు. ఆర్ అండ్‌బీ రహదారుల్లో టోల్‌గేట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా నాయకులు నూకరాజు, గొలగాని చిన్ని, బి.బాబీ, మహేష్, అప్పారావు, మంత్రి సత్తిబాబు, అప్పారావు, స్వామి, రాము, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్య పరిష్కారానికి వినతి



ఈవోకు వినతిపత్రం అందిస్తున్న దేవినగర్ వాసులు

తుమ్మపాల: మండలంలో కొత్తూరు పంచాయతీ దేవినగర్‌లో కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం పంచాయతీ ఈవోకు వినతిపత్రం అందజేశారు. సమీపంలో ఉన్న దొంగ గెడ్డకు సీసీ కాలువ నిర్మించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

ప్రైవేటు లేఅవుట్‌లో ప్రభుత్వ భూమి గుర్తింపు



ఊడేరు సర్వే నెం.33, 211 ప్రైవేటు లేఅవుట్‌లో సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

తుమ్మపాల: మండలంలో ఊడేరు గ్రామంలో సర్వే నంబర్ 33లో కొందరు వ్యక్తులు వేసిన ప్రైవేటు లేఅవుట్‌లో ప్రభుత్వ భూమి ఉందని ఇటీవల గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు మంగళవారం సర్వే బృందంతో పాటు రెవెన్యూ సిబ్బంది లేఅవుట్‌లో సర్వే చేపట్టారు. ప్రభుత్వ భూమిని గుర్తించారు. సర్వే నెం.211 కొండపోరంబోకు భూమిలో సుమారు 30 సెంట్ల వరకు ప్రైవేటు లేఅవుట్‌లో ఉందని, ఎటువంటి ఆక్రమణలు చేయకుండా చర్యలు తీసుకుంటామని వీఆర్వో భ్రమరాంబ తెలిపారు. సర్వే నెం.33లో వేస్తున్న లేఅవుట్‌కు సంబంధించి అనుమతులను కూడా పరిశీలిస్తామన్నారు.

మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులపై కేసు



డ్రైవింగ్ చేస్తూ పట్టుబడిన మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి: ద్విచక్ర వాహనాలు డ్రైవింగ్ చేస్తూ మైనర్లు పట్టుబడితే వారి తల్లి దండ్రులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ హెచ్చరించారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బైక్ డ్రైవింగ్ చేస్తూ మైనర్లకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సారిగా విడిచిపెడతామని, రెండోసారి పట్టుబడితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ డి.శేఖరం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద రోగులకు మెరుగైన వైద్యం కోసం వినతి




సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అనకాపల్లి: పేద రోగులకు ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందించాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు బొట్టా చిన్నియాదవ్ కోరారు. ఈ మేరకు స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలో ప్రారంభించి 15 రోజులకే పాడైన సీటీ స్కానింగ్ మిషన్‌ను తక్షణమే బాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆళ్ల ప్రవీణ్‌కుమార్, నాయకులు బండి అప్పారావు, బొబ్బిలి గోవిందరాజులు, కె.తాతారావు తదితరులు పాల్గొన్నారు.

'ఏరులై పారుతున్న మద్యం'

అనకాపల్లి: పట్టణ, మండలంలో మద్యం ఏరులైపారుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అన్నారు. ఇంటింటికీ సీపీఎం ప్రజాపోరు యాత్రలో భాగంగా మంగళవారం పూడిమడక రహదారి, రామాలయం వీధి, పెదరెల్లి వీధి, శారదాకాలనీలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బెల్ట్‌షాప్‌లు నిర్వహిస్తున్నారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, కమిటీ సభ్యులు బొప్పే ఉమామహేశ్వరరావు, కాళ్ల తేలయ్యబాబు, అల్లు రాజు, చలపతి, నూక అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

చందన స్వామిగా ధ్యాన వేంకటేశ్వరస్వామి



చందన రూపంలో దర్శనమిచ్చిన ధ్యాన వేంకటేశ్వరస్వామి



దర్శించుకుంటున్న భక్తులు

కశింకోట: కశింకోటలోని ధ్యాన వేంకటేశ్వర స్వామి చందన స్వామిగా భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. కార్తీక మాసం తొలి ఏకాదశి పురస్కరించుకొని దాదాపు నిత్యం వజ్ర కవచంతో దర్శనమిచ్చే స్వామిని సుమారు 300 కిలోల చందనం పూత వేసి పూల మాలలు, తులసి మాలలతో అందంగా అలంకరించారు. విష్ణు సహస్ర నామార్చన చేశారు. ఆలయ అర్చకుడు రేజేటి రామచరణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

వరిలో కాండం తొలిచే పురుగుపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ సీహెచ్.ముకుందరావు

అనకాపల్లి: ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరిలో కాండం తొలిచే పురుగు పెరిగే అవకాశం ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక ఆర్ఏఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలను ఎకరానికి 8 కిలోల చొప్పున లేదా క్లోరింత్రనిలిప్రోల్ 0.4 జీ గుళికలను ఎకరానికి 4 కిలోల చొప్పున 8 కిలోల ఇసుకను కలిపి చల్లుకోవాలన్నారు. వరిలో సుడిదోమ నివారణకు ట్రిఫ్లూమిజోపైరిం మందును లీటరు నీటికి 0.48 మీ.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. రబీలో మొక్కజొన్నను నవంబరు 15లోగా వేసుకోవడం వల్ల అధిక దిగుబడులు పొందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు కె.వి.రమణమూర్తి, వి.గౌరీ, బి.భవాని, ఎ.అలివేణి, తదితరులు పాల్గొన్నారు.

వెదురుపర్తిలో 'విద్యార్థీ మేలుకో'



వెదురుపర్తిలో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో మంగళవారం విద్యార్థీ మేలుకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టెన్త్ విద్యార్థుల ఇళ్లకు ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, ఎ.వి.ఎస్.మూర్తి, వై.విజయ్ ఉదయం వెళ్లి వారు చదువుతున్న పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేసి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థి మేలుకో కార్యక్రమంతో విద్యార్థుల్లో ఆరోగ్యం, విజ్ఞానం, ఉజ్వల భవిష్యత్ కలిగించే లక్ష్యంతో పాటు తల్లిదండ్రులతో సత్సంబంధాలు ఏర్పడటానికి దోహదపడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయపడ్డారు.

190 మందికి నేత్ర పరీక్షలు



తుమ్మపాలలో వృద్ధులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

తుమ్మపాల: నేత్ర సంబంధిత సమస్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, ఆకుకూరలు వినియోగంతో కళ్లను కాపాడుకోవచ్చని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. మండలంలో తుమ్మపాల పోలిపల్లెమ్మ అమ్మవారి ఆలయం వద్ద వాకర్స్ క్లబ్, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, మాజీ సర్పంచ్ కర్రి బాబీ ప్రారంభించారు. 190 మంది వృద్ధులు, తదితరులకు శంకర్ ఫౌండేషన్ వైద్యులు నిఖిల్, దివ్య, ఝాన్సీ పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేసారు. శస్త్ర చికిత్స అవసరమైన వారిని శంకర్ ఫౌండేషన్‌కు తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తామని కో-ఆర్డినేటర్ సిహెచ్.అశ్విన్‌కుమార్ తెలిపారు. మొత్తం 190 మందికి పరీక్షలు చేయగా.. 50 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యుడు డీడీ నాయుడు, సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ కన్నారావు, గ్రామ పెద్దలు బొడ్డపాటి రాజారావు, నడిపల్లి గణేష్, పిళ్ళా హరశ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా ఏకాదశి పూజలు



కశింకోటలో సాలిగ్రామ పూజలు చేస్తున్న భక్తులు



కశింకోట శివాలయంలో అభిషేకం చేస్తున్న అర్చకుడు



దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామికి 108 దీపాలతో హారతి ఇస్తున్న అర్చకులు



పీలావారి గౌరీపరమేశ్వరుల ఆలయం వద్ద విద్యార్థుల భరతనాట్యం ప్రదర్శన

అనకాపల్లి: నియోజకవర్గంలో కార్తీకమాసం ఏకాదశి పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయం ముఖ మండపంలో స్వామి ఉత్సవమూర్తి విగ్రహానికి 108 దీపాలతో హారతి ఇచ్చారు. తెల్లవారు జాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

- గవరపాలెం గౌరీపంచాయతన ఆలయంలో గౌరీపరమేశ్వరుల శ్రీలక్ష్మీనారాయణ కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. అంతకు ముందు స్వామివారిని పట్టణంలో ఊరేగించారు.
- గవరపాలెం పీలావారి గౌరీపరమేశ్వరుల అమ్మవారి మహోత్సవంలో భాగంగా గౌరీసేవా సమితి ఆధ్వర్యంలో బుద్ద గిరిజా స్పందన విద్యార్థుల భరతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది.
- స్థానిక మెయిన్ రోడ్డు సుంకరమెట్ట జంక్షన్ వద్ద సూర్యనారాయణ, సత్యనారాయణస్వామి దేవాలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు.

కశింకోట: కశింకోటలోని పలు ఆలయాల్లో మంగళవారం కార్తీక మాసం తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, రామాలయాల్లో ఏకాహం 24 గంటల భజన కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం ఉదయం వరకు కొనసాగనుంది. లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామిని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయంలో కూడా ఏకాదశి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాలిగ్రామ పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో సాయంత్రం ఆకాశ దీప పూజలు జరిగాయి.